జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

# హంసలా కలకాలం

చేహారా వెంకటసుబ్బారావు

అయ్యగారు తోటలోకి వచ్చారని గంగులు చెబితే నమ్మలేదు పోలయ్య. తనపని చూసుకొంటున్నాడు. తోటకి చుట్టువున్న ముళ్ల కంచెను సర్దుతున్నాడు.

"అయ్యగారొచ్చినార్రా మావా!" మరలా అన్నాడు.

తనమాట నమ్మనందుకు చీకాకూ, పోలయ్య అయ్యగార్ని చూడ్డానికి వెళ్లనందుకు భయమూ ధ్వనించాయ్ గంగులు మాటల్లో.

వెనక్కుతిరిగి చూసాడు పోలయ్య. ఆశ్చర్యపోయాడు. చివాల్న లేచి.

"ఎంత సేపయిందిరా అయ్యగారొచ్చి?"

భయంగా అడిగాడు.

"ఇప్పుడే మావా!" చెప్పాడు గంగులు.

గబగబా కొబ్బరిచెట్టుఎక్కి రెండు కాయలు దించాడు. అయ్యగారి దగ్గరికి పరుగెత్తుకొని వెళ్లాడు. అయ్యగార్ని సమీపించి.

"కొబ్బరి బొండాలు తెచ్చానయ్యగారూ" అన్నాడు వినయంగా.

ఆ అయ్యగారు పోలయ్య మాటలను వినిపించుకోలేదు. ఎటో చూస్తూ పరధ్యాన్నంగా వున్నారు. అటువేపే చూశాడు పోలయ్య కూడా.

ఎదురుగా కొంచెం దూరంలో రెండు కోడి పిల్లలు పోట్లాడుకొంటున్నాయ్....రెక్కలు విచ్చుకొని ఒకదానిమీది కొకటి ఎగురుతూ కాళ్ళతో తన్నుకొంటున్నాయ్. తల్లి కోడి కొంచెం దూరంగా పోవడంతో ఆ పిల్లలు తమ పోట్లాటను విరమించుకొని తల్లి దగ్గరికి పోయాయ్.


"మంచి ఎండలో వచ్చారు, తీసుకోండి బాబూ! పంచదార నీళ్ళలా వుంటాయ్!" అన్నాడు మరలా.

అయ్యగారు బొండాంని అందుకొని త్రాగడం మొదలుపెట్టారు. అయ్యగారివైపే చూస్తూ వుండిపోయాడు పోలయ్య. అయ్యగారిలో యిదివరకటి వుత్సాహమూ మందహాసమూ కన్పించలేదు. చీకాకుగా కన్పిస్తున్నారు. తనకు తెల్సినంతలో అయ్యగారు ఆ కొబ్బరి తోటలోకి రావడం చాలా అరుదు. గత పది సంవత్సరాల్లోనూ అంటే తాను పనికి కుదిరిన తర్వాత అయ్యగారు ఏ నాలుగైదుసార్లో వచ్చి వుంటారు. ఒంటరిగా యెప్పుడూ రాలేదు. ఈమధ్య మినిష్టరుగారయ్యాక అసలు వూళ్ళోకే రావడం మానేశారు. వచ్చినా ఎంతో కాలం వుండరు. ఎప్పుడూ హైదరాబాదులోనే వుంటూ వుంటారు. లేదా కేంపులు తిరుగుతూ వుంటారు. ఎలక్షను అయాక అంటే అయ్యగారు ఎలక్షన్లలో గెలిచాక అదే చూడ్డం పోలయ్యకి. అయ్యగారు గతరాత్రి వూళ్ళోకి వచ్చారని తెల్సింది. వెళ్ళి ఒకసారి చూడాలనుకొన్నాడు. అయ్యగారే తోటలోకి ఒంటరిగా రావడం ఆశ్చర్యం వేసింది పోలయ్యకి.

"బాబుగారూ!" అని సంకోచిస్తూ ఆగిపోయాడు పోలయ్య.

అయ్యగారు తమ చూపుల్ని పోలయ్యవైపు మరల్చారు. యేమిటో అడగమన్నట్లు చూశారు.

"మనం ఎలచ్చన్లో గెల్చినాం గందా! ఆ





## రచయిత గురించి



బర్మా మనదేశంనుండి విడిపోవడమూ, తూర్పుగోదావరిజిల్లాలో శ్రీ బెహరా వెంకటసుబ్బారావు పుట్టడమూ ఒకే సంవత్సరంలో జరిగాయి. విజయనగరంజిల్లాలో 'పూసపాటిరేగ' గ్రామంలో సబ్ పోస్టుమాష్టరు వుద్యోగం. ఇప్పటివరకూ సుమారు నలభైకథలు అన్నిప్రముఖ వార మాస పత్రికల్లోనూ ప్రచురించబడ్డాయ్. 1977లో ఆంధ్ర సచిత్ర వారపత్రిక వారు నిర్వహించిన దీపావళి కథల పోటీలో సంపాదకుని బహుమతితోబాటు ఆ పత్రిక వారు నిర్వహించిన పాఠకులబ్యాలట్‌లో వీరి "వన్ మినిట్" కు ప్రథమ బహుమతి లభించింది.

పియ్యే బాబూ, కార్లూ మరిగంటే ఆడు ఆడి పేరు తెల్దు! ఎప్పుడూ మీ ఎనకాలే వుండేవాడు ఆడూ యింకా రానేదేం బాబూ? అళ్ళంతా ఎన కాల కార్లో వత్తామన్నారా బాబూ?"

పోలయ్య అమాయకపు ప్రశ్నలకి చిరునవ్వు చిందించారు మాజీ మంత్రి శ్రీశ్రీ తిరోగమనపు తిరుమలరావుగారు.

అయ్యగారి పెదవులపై చిరునవ్వు చూశాక కొంత ధైర్యం వచ్చింది పోలయ్యకి. చొరవ తీసుకొన్నాడు.

"అవును బాబూ! ఆరు కూడా యిమానంలో వత్తే కరుసులు దండగ! కారులోనే రానీయండి!" అన్నాడు.

అయ్యగారు యిదివరకటిలా హైదరాబాదు నుండి విమానంలోనే వచ్చారనుకొన్నాడు.

"వాళ్ళెవరూ రారురా!" తగ్గుస్వరంలో అన్నారు తి.తి. రావుగారు.

ఆశ్చర్యపోయాడు పోలయ్య.

"ఎందుకు రారు బాబూ? మనం ఎలెచ్చన్లో గెల్చినాంగందా! పదివేలా? పాతికవేలా? దగ్గిర దగ్గిర రెండు లచ్చలు కరుసయినాయ్! ఈపాలి అదేదో కొత్త పారిటీ కళ్ళెంపట్టిన రౌతంట! అక్కడెక్కడో గెల్చినాదని యిక్కడికూడా పారొచ్చింది! మన కరుసును పెంచీసినాది! తమరు సెప్పనేక పోనారా బాబూ! పియ్యేల్ని ఆళ్ళనీ పంపించమని!"

వాడి అమాయకపు ధోరణికి ఆశ్చర్యపోయారు తి.తి. రావుగారు.

"మన కలాంటి సిబ్బంది వుండరురా!" సౌమ్యంగా చెప్పారు.

"ఎందుకుండదు బాబూ?" దబాయించాడు పోలయ్య.

"ఇక మీదట మనం మంత్రి కాదు కాబట్టి!"

షాక్ తిన్నాడు పోలయ్య.

"ఎందుకు మంత్రిగారు బాబూ? తమరు గెల్చినారు గందా?"

"మనం గెల్చాం! కానీ ఏం లాభం? మన పార్టీ మనుషులు యెక్కువగా గెలవలేదు! ఆ బెత్తం పార్టీ మనుషులు యెక్కువమంది గెల్చారు!"

"ఏ పారిటీ మనుషులు ఎక్కువమంది గెలిస్తే మనకేం బాబూ! మనం గెల్చినాం! ఇదివరకటినాగే తమరికి మంత్రి పదవి రావల!






నా సౌందర్యం. అంటే ఆయనకు ఎంతో ప్రీతి! ఆ విషయం ఆయన చెప్పనవసరం లేదు — ఆయన కళ్ళలోకి చూస్తేనే చాలు! అలా కలిగే ఆనందానికి హద్దులేదు. ఆ ఆనందం వలన ఇంటి పనులలో నాకు — కష్టమేకలగదు.

నిజం చెప్పాలంటే నాకు వివాహమయి పది సంవత్సరాలు పూర్తయిందంటే నమ్మలేరు గదా.. కాదా? ఆ రహస్యం—ఆయనకు, నా సౌందర్యానికి సహాయం చేస్తోన్న పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్‌కి మాత్రమే తెలుసు.

పాండ్స్ వ్యానిషింగ్ క్రీమ్
మీరు కూడా సౌందర్యంతో శోభించండి.

Pond's

PIL. 1840 R.

గట్టిగా తవరు అడగలేదు గావాల!"

వాడికి యెలా చెప్పాలో తెలియక తికమక పడ్డారు తి.తి. రావుగారు.

"మన పార్టీవాళ్ళు కారురా! వాళ్ళ పార్టీ ఎమ్మెల్యేలంతా కల్సి ప్రభుత్వాన్ని యేర్పాటు చేసుకొన్నారు. వాళ్ళ పార్టీ మనుషులకే మంత్రి పదవు లిస్తారు. మనం గెల్చీ లాభం లేదు!"

అయ్యగారి మాటల్లో నిరాశా నిస్పృహా వెల్లబికాయ్.

"రెండు లచ్చలు కరుసుసేసి యిరవై వేలు మెజారిటీతో గెల్చిన మనవూ ఆ ఓడిపోయిన కళ్లెం పట్టిన రౌతు గుర్తు నూకరాజూ ఒకటే నంటారాబాబూ! అలా అనకండి బాబూ! తవరు మినిట్టరు గావాల! మినిట్టరుగారి కమతంలో పని సేత్తున్నావని యింతకాలవూ సెప్పుకొనేవాళ్ళం! తవరు హంసలా కలకాలవూ జీవించాల! తవరి పాదాలకాడ మేం గర్వంగా బతకాల!"

కన్నీరు నింపుకొన్నాడు పోలయ్య. తనకే మంత్రిపదవి పోయినంతగా ఏడ్చాడు. వాడికి స్వామిపై వున్న భక్తి విశ్వాసాలకి ముగ్ధులయ్యారు అయ్యగారు.

కళ్ళను వొత్తుకొని మరలా అన్నాడు పోలయ్య.

"బాబూ!"

"…………"

"మరి గంటే, ఆ పార్టీవోళ్ళకయితే మంత్రి పదవి రావడం ఖాయమే అంటారా బాబూ?"

"ఖాయం కాకపోయినా దొరికే అవకాశం వుంటుందిరా!"

"అయితే వో పని సేద్దాం బాబూ!" తక్షణమని అన్నాడు.

ఏవిటన్నట్లు చూశారు మాజీమంత్రి శ్రీ తి.తి. రావుగారు.

"మనవూ అరి పారిటీలోకే పోదాం బాబూ! ఏ పారిటీ అయితేనేం! తవరు మంత్రి గావాల! మాకు సంతోషంగుండాల!"


నిస్సంకోచంగా తనకు తోచినది చెప్పాడు పోలయ్య.

తి.తి. రావుగారు మాట్లాడలేదు. ఆలోచనలో పడ్డారు.

"పార్టీ ఫిరాయింపు!" ఆ ఆలోచన తనకెన్నోసార్లు వచ్చింది. తన బంధుమిత్రులు చాలామంది ఆ సలహా యిచ్చారు కూడా. ఇప్పుడు అమాయకుడూ నిష్కల్మష హృదయుడూ అయిన పోలయ్య కూడా అదే మాట! పార్టీ మారితే? మంత్రి పదవి లభిస్తుందన్న గ్యారంటీ లేదు. అప్పటికే తనకన్న సీనియర్లు పార్టీ మారి అధికార పార్టీలోకి చేరిపోయారు. అయినా వారికి మంత్రిపదవి లభించిందా? లభించకపోయినా అధికార పార్టీవాడు కాబట్టి అనేక విధాల లాభాలూ సదుపాయాలూ వుంటాయ్! ఎలక్షన్ల ముందు సభలో తన నియోజక వర్గంలో చాలా గ్రామాలకి రోడ్లు వేయిస్తానని వాగ్దానం చేశాడు. కొందరి పెద్దలకి ఆ రోడ్ల కాంట్రాక్టులు యిప్పిస్తానని హామీలు యిచ్చి తన బలాన్నీ బలగాన్నీ బాగా పెంచుకొన్నాడు. బస్సు సౌకర్యాలు కల్గిస్తానని రోడ్లు కూడా లేని మారుమూల గ్రామస్తులకి ప్రామిస్‌లు పారేశాడు. తనను ఆశ్రయించుకొని ఆశతో తిరిగేవాళ్ళకి పర్మిట్లూ కాంట్రాక్టులూ యిప్పించాలి. తన ప్రజ తనమీద ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు. అవన్నీ సాధించాలంటే ఎలా? అధికార పార్టీలో చేరిపొమ్మని ఎంతోమంది ప్రోత్సహిస్తున్నారు. ఆఖరుకు పోలయ్య కూడా అదే మాట! అలా అయితే తన పరువు? ప్రతిష్ఠ? పార్టీ ప్రెస్టేజీ! ఆపైన పోలసీ మాట?

ఆ మధ్య అంటే అసెంబ్లీ ఎలక్షన్ల ముందు ఒక ప్రముఖ సీనియర్ రాజకీయ నాయకుడు ఒక రోజిల్లా తన చెవిని యిల్లు కట్టుకొని హితబోధ చేశాడు. కొంచెం బంధుత్వం కూడా కలిపి చనువు తీసుకొని హెచ్చరించాడు కూడా.

"ఓ తిరుమలయ్యా ఆఖరిసారిగా నే చెప్పేది విను! విని నిదానంగా ఆలోచించు. త్వరలో ఒక



నిర్ణయానికి రా! హైస్కూలు మొహం కూడా చూడని నీకు మంత్రి పదవి ఎలా లభించిందనుకొన్నావ్? ఎందుకిచ్చారో తెలుసా? నీకి జిల్లాలో పలుకుబడి వుంది. బలగం వుంది. ఆ మధ్య నీవు పార్టీ మారే ప్రయత్నంలో వున్నట్లు పుకార్లు పుట్టాయ్. మీలో మీరు చెవిలో గుసగుసలాడుకొన్నా మీ మాటలు రాజధానికి విన్పించాయ్. నీవు నిష్క్రమిస్తూ నీతోబాటు మరో పదిమందిని బయటకు లాక్కుపోతావని వాళ్ళకి తెల్సు! అందుకే ఈ సంధ్యా సమయంలో నీకో మంత్రి పదవిని పారేసారు. ఇదెంత మూడునెలల ముచ్చట! మరో మూడు నెలల్లో అసెంబ్లీకి ఎలక్షన్లు జరగబోతున్నాయ్. మీ పార్టీ మరలా అధికారంలోకి రావడం అసంభవం! ఒకవేళ అధికారంలోకి వచ్చినా నీకు తిరిగి మంత్రి పదవి లభించడం యెలాగూ వుండదు. నీకన్నా చదువూ, పలుకుబడీ, డబ్బూ వున్నవాళ్ళు యెంతోమంది వున్నారు. నీ శ్రేయస్సు కోరి చెబుతున్నా! రా! మా కొత్త పార్టీలోకి వచ్చి చేరు! నీ భవిష్యత్తు దివ్యంగా వెలుగుతుంది!"

ఆ హితబోధకు ప్రభావితుడు కాలేదు తాను. కారణం? తాను ప్రస్తుతానికి మంత్రి! రాకరాక వచ్చిన పదవి! మూడు నెలలైనా మూడు వారాలైనా మంత్రి మంత్రే! ఆ తర్వాత మాజీ మంత్రి! కాకిలా కలకాలం బతికే కన్నా హంసలా ఆరునెల్లు కాదు ఆరు వారాలు బతికినా చాలు! అయినా తన పార్టీ ఓడిపోవడం జరగని పని. ముఖ్యమంత్రికి తన మద్దత్తునూ విశ్వాసాన్ని ఎల్లవేళలా ప్రకటిస్తున్న తనకు మరలా మంత్రి పదవి రావడం ఖాయం! అయితే తాను గెల్చి పార్టీ కాండిడేట్సు చాలామంది ఓడిపోతే! ఛీ! ఈలాంటి ఆలోచన రావడానిక్కూ అస్కారంలేదు! రూలింగ్‌పార్టీ ఓడిపోవడమా?"

అలా అప్పట్లో నాలారోజులూ వారాలూ ఆలోచిస్తూ గడిపారు తి.తి. రావుగారు. మంత్రి పదవినీ, పార్టీనీ వదలుకోలేక పోయారు.

పర్యవసానం? తాను కాకిలా ఏకాకిగా జీవించాలి!

మరలా ఆలోచనలో పడ్డారు మాజీ మంత్రిగారు. బాగా చీకటిపడేవరకూ తోటలోనే గడిపారు. మనశ్శాంతికోసం ఏకాంతంగా గడపాలని వెళ్ళినా శాంతిలేదు! విశ్రాంతిలేదు. ఇల్లు చేరేసరికి రాత్రి అయింది. అర్ధాంగి తృప్తి కోసం అయిదు పుంజీల మెతుకులు మేసారు.

రాత్రి నిద్రపట్టలేదు. గడియారం కొట్టే గంటలు లెక్కపెడుతూ గడుపుతున్నారు.

తనను రాజకీయాల్లోకి దించి తన్నింతవాడిని చేసిన గురువూ, ప్రముఖ రాజకీయనాయకుడూ మాజీ మంత్రీ (తనలాగే) అయిన ఆదినారాయణగారు జ్ఞప్తికి వచ్చారు. ఎలక్షన్ల ముందు ఒకనాడు ఆయన రాజకీయపు భగవద్గీత చదివి వినిపించారు. అర్థ తాత్పర్యాలు విడమర్చి చెప్పారు.

"…కావున ఓ తిరుమలా! ఎన్ని ఆవాంతరాలు వచ్చినా అవరోధాలు కల్గినా, ఎదురుదెబ్బ తగిలినా పరాజయం పొందినా పార్టీ ఫిరాయింపు

మాత్రమూ యెన్నడూ చేయకు; కనీసం ప్రోత్స హించకు; అది క్షమించరాని నేరం; మాతృమూర్తికి చేసిన ద్రోహంతో సమానం; నన్నడిగితే పార్టీకి పెట్టుకొనే ప్రాథమిక దరఖాస్తు ఫారంలోనే ఈ విధమైన ప్రతిజ్ఞ లేక ప్రమాణం యిరికించాలి. నేనే కనుక పార్టీ అధ్యక్షుణ్నయితే ఆ విధంగా ఒక ప్రమాణాన్ని దరఖాస్తు ఫారంలోనే పొందుపరుస్తాను. ఈ పార్టీ ఫిరాయింపు నిషేధిస్తూ ఓ శాసనం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాలనుకొంటున్నాను;

"ఇంకా చెప్పేది సావధానంగా విను; పార్టీలు మార్చేవానిపై ప్రజలకు అంటే ఓటర్లకు సదభిప్రాయం వుండదు; దురభిప్రాయం కలుగుతుంది. ప్రజలు అనగా ఓటర్లు నిన్ను అనుమానిస్తారు; ఆపైన అవమానిస్తారు; నీచంగా చూస్తారు; పురుగును చూసినట్లుగా విదిలించుకొంటారు. రేపు వాళ్ళింటికి వెళ్ళి ఓటివ్వమని అడిగితే——

"రేపొద్దున్న గెల్చాక మరలా పార్టీ ఫిరాయించవన్న గ్యారంటీ యేమిటి?" అని నీ మొహాన్నే అడిగేస్తారు. మొదటి గెంటినా ఆశ్చర్యపోనవసరంలేదు. నీలోని ఈ లోపాన్ని నీ ప్రత్యర్థులు ఆసరాగా తీసుకొని తమ ప్రచారాన్ని సాగిస్తారు; పార్టీలు మార్చేవాణ్ని నమ్మి ఓటు వేసి గెలిపించి మిమ్మల్ని మీరు మోసగించుకోకండి; తద్వారా దేశానికి ద్రోహం చేయకండి; ఆ తర్వాత విచారించి లాభంలేదు; రాజకీయాల్లో నిలకడలేనివాడినీ, పార్టీలు మార్చే వాడినీ, రంగులు మార్చే వూసరవెల్లుల్నీ యెన్నుకొని మీరు సాధించేది ఏదీలేదు;" అని యింకా కొన్ని కల్పించి నీమీద దుష్ప్రచారం చేస్తారు.

కనుక ఓ తిరుమలా....!" అని యింకా ఏవేవో కొన్ని అధ్యాయాలు చదివి విన్పించారు ఆదినారాయణగారు ఆనాడు.

నిజానికి ఆయనకు తానెంతో ఋణపడి వున్నాడు. తననీ స్థితికి తెచ్చినవాడు ఆయనే.

పార్టీ మార్చమని అంతరాత్మ ప్రబోధం ఒకవైపు....గురువుగారి హితబోధ మరియొకవైపు. మధ్య నలిగిపోతూ జాగరణ చేశారు మంత్రి శ్రీ తి.తి రావుగారు. తెల తెలవారుతూండగా ఓ నిశ్చయానికి వచ్చారు. గుండెలను చీల్చుకొని అంతరాత్మను తన పిడికిటికి తీసుకొని పీక పిసికి దూరంగా పారేసారు. అంతరాత్మకు చావు లేదని యెంతోమంది చెప్పినా నమ్మలేదు. కానీ కళ్ళారా చూసాక నమ్మక తప్పిందిగాదు!

అంతరాత్మ లేచి నిలబడింది. మందహాసం చేస్తూ మూడడుగులు ముందుకు వేసింది. జాలిగానూ సానుభూతితోనూ చూసింది. అయినా ఖాతరు చేయలేదు రావుగారు. గురువుగారి అడుగుజాడలలోనే నడవాలని నిశ్చయించుకొన్నారు. మనసును సమాధాన పరచుకొనే ప్రయత్నంలో పడ్డారు. ఎప్పుడు నిద్ర పట్టిందో తెలీదు.

అయ్యగారికి తెలివి వచ్చేసరికి రెండు బారలు పొద్దెక్కింది. నిద్ర లేవగానే ఎదురుగా వున్న టీపాయ్‌మీద ఆనాటి "ఈనాడు" కనిపించింది. తీసి హెడ్డింగులు చదవటం మొదలెట్టారు.

మొదటి పేజీలోనే అడుగున వున్న హెడ్డింగును చూసి నిర్ఘాంతపోయారు.

"మాజీ మంత్రి శ్రీ అవకాశం ఆదినారాయణగారు అధికార పక్షంలో చేరిక;"

కళ్ళు బైర్లు కమ్మాయ్ తి. తి. రావుగారికి.

కళ్ళు నులపుకొని, చేతిని గిల్లుకొన్నారు. ఆ వార్తను పూర్తిగా చదివారు. హతాశయులయ్యారు.

దూరంగా నిలబడి తనను గమనిస్తూ మందహాసం చేస్తూన్న అంతరాత్మను చూస్తూ మరలా మంచంమీదికి ఒరిగిపోయారు.

అంతరాత్మ విజయగర్వంతో తిరిగి ఆ మాజీ మంత్రిగారిలో ప్రవేశించింది.

"కాకిలా కాదు; హంసలా కలకాలం జీవించు;" అంది. □



# బ్రహ్మపదార్థం

కప్పగంతుల మల్లికార్జునరావు

ముక్కు మొహం కన్పించని ప్రతి రాయినీ రప్పనీ దేవుడేననుకొని దండాలు పెట్టేవాడు చిరంజీవి. చిన్నతనంలో అతనికి అదో హాబీగా తయారవటానికి తగిన కారణాలు లేకపోలేదు.

చిరంజీవి తండ్రి పౌరోహిత్యం చేసేవాడు. తల్లి మూసివాయనాలు పట్టుండేది. అవసరమైతే వంటలు చేసేది. ఎన్ని చేసినా ఆ ఇంట్లో దరిద్ర దేవత ఎప్పుడూ తాండవిస్తూనే వుండేది.

"దేనికయినా కాలం ఖర్మం కలిసిరావాలి. ఆ భగవంతుడికి మనమీద దయ కలగాలే కానీ సిరి తోసుకు రావటం ఎంతసేపు!"

సిరి తోసుకొచ్చే కాలం కోసమే చిరంజీవి దేవుళ్ళని ప్రార్థించటం అలవాటు చేసుకొన్నాడు. కానీ ఆ కాలం ఎంతకూ రాదేం?

"ఇలా కన్పించిన రాయికీ రప్పకూ సాష్టాంగ దండ ప్రమాణాలు చేయటం 'రిడిక్యులస్'గా వుంటుంది చిరంజీవీ. భారతీయులంటే విదేశీయులకి అందుకేట అంత చులకన; దేడీ చెప్తుంటాడు" రుక్మిణి అలా మందలిస్తూ చిరంజీవి ధోరణిని కంట్రోల్ చేస్తుండేది.

రుక్మిణి పెద్ద ధనవంతుల బిడ్డేం కాదు. ఆమె తండ్రి ఆఫీసర్. జీపులు, నౌకర్లు వుండటంవల్ల వాళ్ళ కుటుంబం గొప్పహోదాలో దర్జాగా వున్నట్లు కన్పించేది. దానికి తోడు రుక్మిణి తండ్రి ఆ హోదాను మైంటైన్ చేసేవాడు. పిల్లల్ని కాన్వెంటులో చేర్పేడు. అప్పుడప్పుడూ వంట చేయటానికి చిరంజీవి తల్లిని పిలిపించేవాడు.

దేవుడిని నమ్ముకోవటంవల్ల చిరంజీవికి చిన్నమెత్తు వుపయోగం జరుగలేదు. సిరి తోసుకొచ్చేకాలం రానేలేదు. పైగా అందరు దేవుళ్ళకూ అన్నన్ని నమస్కారాలు పెట్టుకొనిపోయి పరీక్ష రాసొస్తే అది కాస్తా ఫెయిలయ్యాడు. మరునటిసారి దేవుడన్నవాడిని తల్చుకోనన్నా తల్చుకోకుండా పరీక్ష పాసయ్యాడు.

కాలేజీలో చేరేక చిరంజీవి ధోరణిమారింది. పచ్చి నాస్తికుడయ్యాడు. భగవంతుడిని తిట్టటం ఓ ఫేషన్ అయింది. హేతువాదం పేరిట చెలామణీ అవుతున్న నాస్తిక గ్రంథాలలోని సారాంశాన్ని అమ్మోనియంలా తలకెక్కించుకొన్నాడు. 'హేతువాది'నన్న బోర్డును మొహానికి తగిలించుకొని పెడవాదనలు చేయటం, వుపన్యాసా లివ్వటం అలవాటయింది.

'ఇదేం హేతువాదనయ్యా దేవుడా! హేతువాది మొదటి క్వాలిఫికేషన్ జిజ్ఞాస. హేతువాదం ప్రశ్నలతో ప్రారంభమవుతుంది. దేవుడి విషయమే తీసుకో. దేవుడు అంటే ఏమిటి? ఆ భావనాస్వరూపం ఎలా రూపు దిద్దుకొంది? రాతిని చూసి భగవంతుడనుకోవటంలో గల అర్థ పరమార్థా లేమిటి? యిలా ఆలోచించకుండా, భగవంతుడన్న భావనే మూర్ఖంగా కొట్టేయడం మూఢత్వంకాదూ? రాతిలో దేవుడున్నాడన్న వొక మూఢ విశ్వాసం నుంచి, అసలు దేవుడన్న కాన్సెప్టే తప్పనే మూఢ